క్లుప్తంగా

గుర్రపుడెక్క తొలగించాలి

గూడూరు: మండలంలోని కంకటావ, ముక్కొల్లు గ్రామాల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం ముంపు బారిన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు పెరిగిపోవడంతో నీళ్లు కిందకు పారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంకటావ-కత్తులవారిపాలెం వంతెన కూలిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా గతంలో తూములు ఏర్పాటు చేశారని, ముక్కొల్లు నుంచి వస్తున్న నీటి ప్రవాహానికి తూములు చాలడం లేదని ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాల్వలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. నాయకులు పోతన స్వామి, గోపి నాగబాబు, దాసరి ఉమాసాయిరామ్, సమ్మెట రాఘవప్రసాద్, వాకా శ్రీనివాసరావు, తోట పోతురాజు, కట్టా మునేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ తూము తొలగించాలని వినతి



కొడాలి(ఘంటసాల): మేడూరు చానల్ నుంచి కొత్తపల్లి బ్రాంచి కాలువలోకి రొయ్యల ప్యాక్టరీ వారు అక్రమంగా ఏర్పాటు చేసిన తూమును తొలగించి పంటలను కాపాడాలని కోరుతూ మండలంలోని తాడేపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఇరిగేషన్ ఏఈ ప్రసాద్‌కు శుక్రవారం అర్జీ సమర్పించారు. స్పందించిన ఏఈ ప్యాక్టరీ వారు ఏర్పాటు చేసిన తూము మా పరధిలోకి రాదని, పంటలు ముంపు సమస్య పరిష్కారానికి కాలువలోని తూటికాడ, గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు యార్లగడ్డ వీరభద్రరావు, గొర్రెపాటి సురేష్, కాట్రగడ్డ వేణుగోపాలరావు, ఆచంట బసవేశ్వరరావు, మైనేని మధుసూధనరావు, కొసరాజు ప్రసాద్, కొనగంటి చిన్నబాబు, తుమ్మల ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

పంటనష్టం అంచనాలు సిద్ధం చేయాలి

ఘంటసాల: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు నష్టపోయిన పంటల అంచనాలను సమర్థవంతంగా సిద్ధం చేయాలని తహసీల్దార్ బి.వి జయప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ, మండల, డివిజన్ స్థాయి బృందాలు పంట నష్టం తుదిజాబితాలను రూపొందిస్తారన్నారు. ఎంఏవో కె.మురళీ కృష్ణ మాట్లాడుతూ 33 శాతం పైగా నష్టం వాటిల్లిన పంటల వివరాలను సేకరించి 34 అంశాలతో కూడిన పూర్తి సమాచారంతో తుది నివేదికలు రూపొందిస్తారని, ఒక రైతు గరిష్టంగా 5 ఎకరాల వరకు పంట నష్టంను పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. డీటీ పి.శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



పెదకళ్లేపల్లి(మోపిదేవి): వరద ప్రభావంతో ముంపునకు గురైన పంట పొలాలను పలు గ్రామాల్లో వ్యవసాయాధికారి హెప్సిబారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంట ఐదు రోజులుగా నీటిలోనే మునిగిపోయి ఉందని, ఆకులు మొదళ్లతో కుళ్లిపోయి దుర్వాసన వస్తుందన్నారు. ఉద్యానశాఖ అధికారులు రమేష్ దెబ్బతిన్న వాణిజ్య పంటలను పరిశీలించారు. ప్రతి రైతు తమ పంటను ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు.

నేత్రదానంపై అవగాహన



నాగాయలంక: నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా పలువురు సామాజిక కార్యకర్తలు శుక్రవారం నేత్రదానం ఆవశ్యకత, అవసరతలపై నాగాయలంక ప్రధాన కూడలిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గత నెల 25 నుంచి 8వ తేదీ వరకు తలపెట్టిన పక్షోత్సవాల సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుదర్శి అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ మాట్లాడుతూ గ్రామస్తులు, మండల ప్రజలకు నేత్రదాన విశిష్టతను తెలిపి, ఒకరి నేత్రదానం వలన అంధులైన ఇరువురికి చూపును ఇవ్వొచ్చని వివరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ సభ్యుడు సింహాద్రి కృష్ణ ప్రసాద్, సామాజిక సేవా కార్యకర్తలు బండ్రెడ్డి మలికార్జున్, బండ్రెడ్డి హరి, మత్తి శివ, లేబాక కొండలు, చిట్టా వెంకట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఉధృతం

- పొంచి ఉన్న ప్రమాదం
- లంకలకలువగుంటను సందర్శించిన కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన: పెడన మండలంలోని ప్రధాన కాలువలతో పాటు డ్రెయిన్లు పొంగిపొర్లుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వీటి గట్లు బలహీనంగా ఉండటంతో ఎప్పుడు ఎక్కడ గండ్లు పడతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుడమేరుకు గండిపడి రైవస్ కాలువ ద్వారా వరద నీరు గుడ్లవల్లేరుకు చేరుకుని అక్కడి నుంచి బంటుమిల్లి కెనాల్‌కు చేరుతోంది. ప్రస్తుతం ఉన్న నీటి మట్టం కంటే ఎక్కువగా పెరిగే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని లంకలకలువగుంట ప్రాంతంలో కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయి. గతంలోలా మళ్లీ అక్కడే గండ్లు పడే ఛాన్స్ ఉన్నందు వల్ల అధికారులు అప్రమత్తమయ్యారు. మరో పక్క కొంకేపూడి డ్రెయిన్‌లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అక్కడక్కడా తూడు, జమ్ము అడ్డంకిగా మారాయని రైతులు వాపోతున్నారు. రూ.లక్షలు వెచ్చించి బాగు చేయించినా అక్కడక్కడా ఇలా వదిలేశారని రైతులు అంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పేర్కొంటున్నారు.



బంటుమిల్లి కెనాల్‌ను లంకలకలువగుంట వద్ద పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలజీ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పరిశీలించిన జిల్లా కలెక్టర్..

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో ఆయన ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ సిబ్బందితో కలిసి బంటుమిల్లి కెనాల్‌ను శుక్రవారం పరిశీలించారు. పరిస్థితిని సమీక్షించారు. పెడన మండల రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. పర్యవేక్షించాల్సిందిగా మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణిని ఆదేశించారు. కమలాపురం, లంకలకలువగుంట, తాడిచెర్ల గ్రామాల్లోకి వరదనీరు పోయే అవకాశాలున్న నేపథ్యంలో ఆయా గ్రామస్తులను అప్రమత్తం చేయాలన్నారు. జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, ఇరిగేషన్ డీఈ సూర్యభరత్, ఏఈ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దారు పూర్ణచంద్రరావు తదితరులు ఉన్నారు.

అప్రమత్తం చేసిన ఆర్డీవో



సాతులూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాణి తదితరులు

బంటుమిల్లి: మండల పరిధిలోని సాతులూరు పంచాయతీ శివారు సాతులూరు రేవు గ్రామస్తులను మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి అప్రమత్తం చేశారు. శుక్రవారం రాత్రి ఆమె గ్రామంలో పర్యటించారు. తక్షణం ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. తహసీల్దారు భరత్‌రెడ్డి, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి ఎస్ఐ గణేష్‌కుమార్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులను హెచ్చరించారు. గ్రామస్థాయి అధికారులను గ్రామంలోనే ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదిక పంపించాలని ఆర్డీవో ఆదేశించారు.

వినాయక చవితి సందడి



పత్రి విక్రయాలు

మచిలీపట్నంటౌన్/పెడన/అవనిగడ్డ: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో గణపతి నవరాత్రోత్సవాల నిర్వహణకు భక్తులు ఏర్పాట్లు చేశారు. శనివారం వినాయకచవితి పర్వదినం సందర్భంగా గణనాథునికి పూజలు నిర్వహించనున్నారు. పూజకు అవసరమైన గణనాథుని విగ్రహాలు, పత్రి, పండ్లు, పూలు, పాలవెల్లి, గొడుగు తదితరాలను కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పలు కూడళ్లకు తరలివచ్చారు. భక్తబృందాల ఆధ్వర్యంలో గణనాథుని నవరాత్రోత్సవాల నిర్వహణకు పందిళ్లను ఏర్పాటు చేశారు.

మట్టి ప్రతిమల పంపిణీ

కోడూరు: స్థానిక పూతబోయిన చినవెంకటేశ్వరరావు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులకు మట్టి గణనాథుల ప్రతిమలను పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకులు పూతబోయిన కరుణకుమార్, రత్నకుమార్ ఆధ్వర్యంలో 300 ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టి గణనాథులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని వారు కోరారు. మండలంలోని విశ్వనాథపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయకుల ప్రతిమలను తయారు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సాంబశివయ్య ఆధ్వర్యంలో ఈ ప్రతిమలను తయారు చేశారు. హెచ్ఎం రవివర్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బంటుమిల్లి: పెదతుమ్మిడి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 350 మట్టి విగ్రహాలను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎస్ఐ గణేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

అప్పులు తీరేదెట్టా..?

వరదకు పంట ముంపు బాధితుల వేదన

మోపిదేవి: సాగుచేసిన పంట చేతికొస్తే అప్పులు తీరిపోతాయని ఆశపడ్డాం. అందుకే అందిన కాడికి అప్పులు చేసి సాగుచేశాం. వరదకు మండలంలోని పలు ప్రాంతాల్లో వాణిజ్య పంటలు దెబ్బతినడంతో బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు.

మొక్కలు చనిపోతున్నాయి

మండలంలో మొత్తం 473 హెక్టార్లు వాణిజ్య, కూరగాయ పంటలు వేసినట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. అందులో అరటి 161 హెక్టార్లు, పసుపు 83, బొప్పాయి 27, కంద 87, జామ 6, నిమ్మ 6, ఆయిల్‌పాం ఒక హెక్టారు, పూల తోటలు ఒక హెక్టారు, పలు రకాల కూరగాయలు 97 హెక్టార్లలో 1,074 మంది రైతులు సాగుచేస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరద పంటలను తుడిచి పెట్టుకుపోయేలా చేసింది. వరద నీరు తగ్గిన కొద్దీ చనిపోయిన మొక్కలు బయటపడుతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.



కె.కొత్తపాలెంలో వరదలో కొట్టుకుపోయిన పసుపు పంట

చేతికొచ్చే సమయంలో నీటి పాలు



రెండు ఎకరాల్లో అరటి సాగుచేశాను. ఎకరాకు కౌలు రూ.40 లక్షలు, రూ.2 లక్షలు సాగుకు ఖర్చయింది. మరికొద్దిరోజుల్లో గెలలు కోద్దామనుకుంటున్నా. ఇంతలో వచ్చిన వరద మొత్తాన్ని ముంచేసింది. పై నుంచి వచ్చిన చెత్త అరటి చెట్లకు పట్టివేయడంతో వాటిని తొలగించడానికి బోటు, కూలీలకు మరో రూ.20 ఖర్చు చేయాల్సి వచ్చింది.

– మత్తి రాజేంద్రప్రసాద్, రైతు, కె.కొత్తపాలెం

విద్యావేత్త రత్నారావుకు సన్మానం



రత్నారావు మాస్టారును సన్మానిస్తున్న పాఠశాల బాలబాలికలు

నాగాయలంక: స్థానిక విద్యా భారతి పబ్లిక్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, దివిసీమలో సీనియర్ విద్యావేత్త అయిన ఆకుల రత్నారావు మాస్టారుకు పాఠశాల బాలబాలికలు తొలుత క్షీరాభిషేకం చేశారు. అనంతరం దుశ్శాలువాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి మాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఏవీ శేషుబాబు, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరద నీటిలో మునిగిన పసుపు కొమ్ములు

బొబ్బర్లంక(మోపిదేవి): వరద ప్రభావానికి పంటలు పూర్తిగా కొట్టుకుపోయని, పసుపు, కంద, అరటి వంటి వాణిజ్యపంటల్లో లక్షల్లో నష్టపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బర్లంకలో రైతు బాలరామకృష్ణ పండించిన పసుపు పంట బయటకు తరలించలేని పరిస్థితుల్లో మొత్తం వరదలో మునిగిపోయింది. సుమారు 300 పుట్లు అంటే రూ.40 లక్షల విలువచేసే పసుపు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రస్తుతం బాగా ఆర పెడుతున్నామని, మరలా వర్షం వస్తే మరింత నష్టపోయాల్సి ఉంటుందని విచారం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు..

వరదకు దెబ్బతిన్న గ్రామాల్లో విస్తృతంగా శానిటేషన్ చేపట్టినట్లు ఇన్‌ఛార్జీ ఈవోపీఆర్డీ అశోక్ తెలిపారు. అత్తిలి నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులను కె.కొత్తపాలెం, తాడేపల్లి నుంచి వచ్చినవారితో బొబ్బర్లంక, కృత్తివెన్ను మండలం పల్లెపాలెం నుంచి వారితో శానిటేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు వివరించారు.

వరద బాధితులకు సాయం

అవనిగడ్డ: చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ఆధ్వర్యంలో పులిగడ్డ పంచాయతీ పరిధిలోని 200, మోపిదేవి మండల పరిధిలోని బొబ్బర్లంకలో 300 కుటుంబాలకు ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్ రూ.6 లక్షల విలువైన నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన యువనేత మండలి వెంకట్రామ్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ట్రస్ట్ డైరెక్టర్ వేములపల్లి రోజా, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. చల్లపల్లి సచివాలయ ఉద్యోగులు మండల పరిధిలోని పలుప్రాంతాలకు చెందిన 400 మంది వరద బాధితులు, వర్ష ముంపు బాధితులకు అల్పాహారం అందించారు. పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ శివారు రేగుల్లంక, వసుమట్ల, పల్లెపాలెంలో 250 మంది వరద బాధితులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని జనసేన యువనేత మండలి వెంకట్రామ్(రాజా) చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం నేతలు ఘంటసాల రాజమోహనరావు(కన్నయ్య), మానేపల్లి ప్రవీణ్‌కృష్ణ, గుగ్గిలం శ్యాంకుమార్, నంబూరి వెంకటేశ్వరరావు, చెన్నగిరి అయ్యప్పతో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరద బాధితులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నిత్యావసర సరుకులు అందజేశారు. పులిగడ్డ శివారు రేగుల్లంక, వసుమట్ల ప్రాంతాల్లో ఆయన వరద ముంపు గృహాలను పరిశీలించారు. అనంతరం వరద బాధితులకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పెదముత్తేవి ఆశ్రమం ప్రతినిధులు రేగుల్లంక, వసుమట్ల గ్రామాల్లో రొట్టెలు పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి విజయకుమార్, జనసేన యుతనేత మండలి వెంకట్రామ్, డీటీ మండలి కేశవి, ఈవో అనితతో పాటు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.



కొక్కిలిగడ్డ పాఠశాలలో వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న సర్పంచ్‌లు గంగాభవాని, జానకీ రాంబాబు

ఆహార ప్యాకెట్లు అందజేత

మండల పరిధిలోని పులిగడ్డ శివారు పల్లెపాలెంలో వరద బాధితులకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ ఆహార ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. శ్రీనివాస్ సోదరుడు విక్కుర్తి రాంబాబు వీటిని బాధితులకు అందించారు. ఇళ్లు బాగుజేసుకుంటూ పునరావాస కేంద్రానికి వెళ్లలేని వారికి ఈ ఆహార ప్యాకెట్లు అందించారు.

రూ.20 లక్షల విలువైన సరుకుల పంపిణీ

అవనిగడ్డ: జనసేన అమెరికా (ఎన్ఆర్ఐ) ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 1,050 మంది వరద బాధితులకు రూ.20 లక్షల విలువగల బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. జనసేన ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధి అనుసూరు అనిల్, జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ ఆధ్వర్యంలో వీటిని అందించారు. పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు వరద బాధితుకు సాయం అందించినట్టు ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధి అనిల్ చెప్పారు. జనసేన రాష్ట్ర నాయకులు పంచకర్ల సందీప్, ఓడూరి కిశోర్, చిక్కాల సుబ్బారావు, బత్తిన మధు, గరికపాటి శివశంకర్, డాక్టర్ కె.సతీష్, నాయకులు రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): వరద బాధితుల సాయంలో మేము సైతం అంటూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ముందుకు వచ్చింది. కొక్కిలిగడ్డ ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రంలో ఉంటున్న బొబ్బర్లంక వరత బాధితులకు భోజనం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు సహాయ సహకారాలతో 250 వరద బాధితులకు భోజనం అందించారు. బొబ్బర్లంక సర్పంచ్ దొప్పలపూడి గంగాభవానీ, రావి రత్నగిరి, మండల ప్రత్యేక అధికారి పంచాయతీ రాజ్ డీఈ బి.వెంకటేశ్వరావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అయితే దాతలు స్పందించి పశుగ్రాసం ఇప్పించాలని రైతులు సైకం జనార్ధనరావు, గుంటూరు చలమయ్య తదితరులు కోరుతున్నారు.

1,200 మందికి భోజన సదుపాయం

నాగాయలంక: కృష్ణానది వరద తాకిడి, అధిక వర్షాలు నేపథ్యంలో మండలంలో ఇప్పటి వరకు 1200 మంది బాధితులకు పునరావాస కేంద్రాలలో భోజన సదుపాయం కలిగించినట్లు మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ శుక్రవారం తెలిపారు. నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాల, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో కేంద్రాలు నిర్వహించినట్లు చెప్పారు. బందరుకు చెందిన శ్రీబాబా ఫరీద్ మస్తాన్ అవులియా సంఘం ఆధ్వర్యంలో నాచుగుంట, ఈలచెట్లదిబ్బ వాసులకు బిస్కెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తహసీల్దార్ హరనాథ్ చేతులమీదుగా వీటిని అందజేశారు. సంఘం ప్రతినిధులు అక్కుమహంతి రాజా, మట్టా శ్రీనివాసరావు, గున్నం నాగబాబు, పామర్తి లక్ష్మణ్, నాంచారయ్య తదితరులు పాలొన్నారు.

కలెక్టర్ గారూ.. మా గోడు పట్టించుకోరూ!

బంటుమిల్లి: గ్రామ పరిధిలోని మైనర్ డ్రెయిన్లు పొంగిపొర్లుతూ సమీపంలోని కాలనీలను జలమయం చేసి దాదాపు ఐదు రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను జిల్లా కలెక్టరైనా ఆలకించాలని రైతులు, కాలనీవాసులు వేడుకుంటున్నారు. గ్రామాన్ని అనుకుని ఉన్న నాగేశ్వరరావుపేట, బంటుమిల్లి, పెందుర్రు మైనర్ డ్రెయిన్లలోని తూడు, గుర్రపుడెక్క తదితర అడ్డంకులతోపాటు పెందుర్రు మీడియం డ్రెయిన్‌లోని జమ్ము, కిక్కిస పొదలు తొలగిస్తేనే బంటుమిల్లి గ్రామంతోపాటు వందలాది ఎకరాల్లో నిలిచిన మురుగు నీరు బయటకు వెళుతుంది. ఈ మైనర్ డ్రెయిన్లన్నీ పెందుర్రు మీడియం డ్రెయిన్‌లో కలుస్తాయి. ఈ డ్రెయిన్ జమ్ము, కిక్కిస పొదలు, కొంత మంది ఏర్పాటు చేసుకున్న గరికట్లు (చేపల కోసం పెట్టే గరులు) నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి.

కాలనీల్లో, పొలాల్లో ఎక్కడ నీరు అక్కడే..

బంటుమిల్లి, నాగేశ్వరరావుపేట, పెంద్రురు మైనర్ డ్రెయిన్లను ఆనుకుని జగనన్నకాలనీ, బీసీ కాలనీ, బీఎస్ఆర్ కాలనీలున్నాయి. భారీ వర్షాలకు వరద నీరు కాలనీల చుట్టూ, పంట పొలాల్లో ఎక్కడిదక్కడే నిలిచిపోయి రైతులను, కాలనీవాసులను ఇబ్బందులు పెడుతోంది. పెందుర్రు మైనర్ డ్రెయిన్ సరిహద్దుగా ఉన్న జగనన్న మోడల్ కాలనీలో దాదాపు రెండు అడుగులకు పైగా వరద నీరు నిలిచి ఉంది. గ్రామంలోని బంటుమిల్లి–గుడివాడ, బంటుమిల్లి–మచిలీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్లపై గత నాలుగు రోజులుగా నీరు పారుతోంది. కాలనీల్లో నిలిచిన నీటిలో విష సర్పాలు, దోమలు సంచారం వాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. యుద్ధప్రాతిపదికన డ్రెయిన్లు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



నీటిలో నానుతున్న బంటుమిల్లి జగనన్న కాలనీ గృహాలు

మొక్కుబడిగా పరిశీలన...

బంటుమిల్లి గ్రామంతోపాటు, పంట పొలాలు ముంపునకు కారణమైన నాగేశ్వరరావుపేట, పెందుర్రు మైనర్ డ్రెయిన్లను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు, తహసీల్దార్ భరత్‌రెడ్డి పరిశీలన మొక్కుబడిగా మిగిలిపోయిందన్న విమర్శలు వస్తున్నాయి. డ్రెయిన్లు చూసి వెళ్లిన పాలకులు, అధికారులు నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెందుర్రు డ్రెయిన్‌లో జమ్ము, కిక్కిస పొదల తొలగింపు పెద్ద ఖర్చుతో కూడిన పని అని, సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌చార్జి డ్రెయినేజీ ఏఈ వి. నాగేశ్వరరావు తెలిపారు.



బంటుమిల్లి-గుడివాడ రోడ్డుపై దుర్గా మహల్ వద్ద పారుతున్న వరద నీరు



జమ్ము, కిక్కిసలతో నిండిన పెందుర్రు డ్రెయిన్